క్లుప్తంగా

విద్యాలక్ష్మిగా విజయదుర్గ



అలంకరణలో అమ్మవారు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నానుబాల వీధిలో విజయదుర్గ అమ్మవారిని శ్రావణ మంగళవారం సందర్భంగా విద్యాలక్ష్మిగా అలంకరించారు. అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో అమ్మవారికి సహస్ర పుష్పార్చన నిర్వహించారు. రజత విగ్రహానికి పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న గొర్లె కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: కొయ్యాం వైఎస్సార్ సీపీ నాయకుడు దుంప ఈశ్వరరావు తల్లి అనారోగ్యంతో శ్రీకాకుళం పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈమెను మంగళవారం ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట నాయకులు జీరు నాగార్జునరెడ్డి, పాత్రుని రమణ, మంత్రి శ్రీను ఉన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



దారికి అడ్డంగా నిర్మించిన గోడను తొలగిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం నగర పాలక సంస్థ పరిధిలోని కుశాలపురం పంచాయతీ యాతపేట సమీపంలో నర్సింహ చెరువు సర్వే నంబర్ 157–2లో అక్రమ నిర్మాణాన్ని మంగళవారం కూల్చి వేశారు. టౌన్ ప్లానింగ్ టీపీబీవో వాసు, టౌన్ ప్లానింగ్ సెక్రటరీ స్వరూప్, వీఆర్వో పి.శ్రీనివాస్, సర్వేయర్ లక్ష్మణరావుతో కూడిన బృందం అక్రమ నిర్మాణంపై గతంలో నోటీస్ అందజేశారు. చెరువు స్థలంలో అక్రమ నిర్మాణం చేపట్టడం, టౌన్ ప్లానింగ్ నిబంధనలకు వ్యతిరేకంగా ఉండటం, నిబంధనలు పాటించక పోవటం వంటి అంశాలు ఆధారంగా పూర్తి స్థాయిలో పరిశీలించి ఆక్రమణలు తొలగించారు. చెరువులో నిర్మాణాలు చేపడితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేశారు. ఫిర్యాదు వచ్చిన దారి వరకు గోడను తొలగించారు.

కుళాయి పనులకు శంకుస్థాపన

గార: ప్రజలకు సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మంగళవారం బందరువానిపేటలో జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ కుళాయి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

నిలిచిన మద్యం లారీలు

ఎచ్చెర్ల క్యాంపస్: వరుస సెలవుల నేపథ్యంలో ఎచ్చెర్లలోని ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ గోదాం ముందు మద్యం లోడింగ్ లారీలు నిలిచిపోయాయి. మంగళవారం పనిదినమైనా పూర్తిస్థాయిలో అన్‌లోడింగ్ జరగలేదు. వీధిలైట్లు లేకపోవటం, ఉండేందుకు కనీస సౌకర్యాలు లేకపోవటంతో లారీ క్యాబిన్‌లోనే నిద్రపోవాల్సి వస్తోందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేత్రదానంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీకళాశాల (పురుషుల)లో మంగళవారం నేత్రదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా నేత్రదానం ఆవశ్యకతను టెక్నీషియన్ పి.సుజాత, ప్రోగ్రామ్ ఆఫీసర్ గొలివి రమణ వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్ర, ప్రొఫెసర్ డి.రవీంద్ర, ఎన్‌ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ బి.ఎస్.వెంకట చలమయ్య, ఎన్‌సీసీ అధికారి పోలినాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు నిరంతరం కృషిచేయాలని, అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ముందడుగు వేయాలని శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కింతలి సూర్యచంద్రరావు అన్నారు. మంగళవారం స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ బీఎస్ చలమయ్య, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, వీఎస్ కుమార్, డాక్టర్ సంపతిరావు శిశిభూషణరావు, డాక్టర్ రోణంకి హరిత, సీహెచ్ రామ్మూర్తి, రవీంద్ర, అరుణకుమారి, సుధారాణి పాల్గొన్నారు.



భద్రత కల్పించాలి

గ్రామస్థాయిలో వైద్య సేవలు అందిస్తున్న మహిళా సిబ్బందికి ప్రభుత్వం ప్రత్యేక భద్రత కల్పించాలి. కోల్‌కతా వంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలి. నిందితులకు కఠిన శిక్షలు విధించాలి.

– అన్నపూర్ణ,
ఏఎన్‌ఎం, వాండ్రంగి, జి.సిగడాం మండలం



కఠినంగా శిక్షించాలి..

వైద్య సిబ్బందిపై దాడులు చేసిన వ్యక్తులకు కఠిన శిక్ష విధించాలి. కోల్‌కతా ఘటనకు బాధ్యులైన వారికి ఉరిశిక్ష వంటి కఠిన శిక్షలు అమలు చేసినప్పుడే మహిళా వైద్యులపై దాడులు పునరావృతం కావు. ఈ మేరకు ప్రభుత్వం దృష్టి పెట్టాలి.

– పద్మావతి,
ఏఎన్‌ఎం, నిద్దాం, జి.సిగడాం



మిర్తిబట్టి పనులు పూర్తయ్యేనా..?

- ప్రధాన మురుగునీటి కాలువపై నిర్లక్ష్యం
- 25 ఏళ్లుగా తీరని సమస్య
- టీడీపీ నేతల బంధువుల ఆక్రమణలే పనులకు అడ్డంకి
- రూ.40 కోట్లకు పెరిగిన అంచనాలు



శ్రీకాకుళం 80 అడుగుల రోడ్డులోని మిర్తిబట్టి

శ్రీకాకుళం : నగర పరిధిలోని మురుగునీరుతో పాటు వర్షపు నీటిని నాగావళి నదిలోనికి తీసుకుని వెళ్లే మిర్తిబట్టి పనుల్లో తీవ్ర జాప్యం నెలకొంటోంది. పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి ఏర్పడింది. 2005లో అప్పటి ముఖ్యమంత్రి, దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మిర్తిబట్టి మురుగునీటి కాలువ సమస్య తెలుసుకుని నీరు వెళ్లేందుకు వీలుగా శాశ్వత పనులు చేపట్టేందుకు రూ.9 కోట్లు నిధులు మంజూరు చేశారు.

ఇదీ పరిస్థితి..

చాపురం పంచాయతీ నుంచి కలెక్టర్ కార్యాలయం సమీపంలోని నాగావళి నది వరకు సుమారు 7.5 కిలోమీటర్ల పొడవు ఉన్న ఈ కాలువ ఒకప్పుడు సాగునీరు అందించే కాలువగా ఉండేది. నగరం అభివృద్ధి చెందటంతో పాటు భవన నిర్మాణాలు పెరిగిపోవటంతో మురుగునీటి కాలువగా మారిపోయింది. ఈ కాలువ వెంబడి చాలా ప్రాంతాల్లో ఆక్రమణలు జరిగిపోయాయి. అందులో తెలుగుదేశం పార్టీ నాయకుల బంధువులే ఎక్కువగా ఉండటంతో కాలువ అభివృద్ధికి అడ్డంకిగా మారిపోయింది. 2009 తర్వాత వచ్చిన కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు ఈ పనులపై అంతగా శ్రద్ధ చూపలేదు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ 1.5 కిలో మీటర్ల మేర పనులు జరిగాయి. ఆ తర్వాత అవాంతరాలు ఎదురు కావటంతో పనులు నిలిచిపోయాయి. తాజాగా మున్సిపాల్టీ అధికారులు మరోసారి అంచనాలు రూపొందించారు. మిగిలి ఉన్న 6 కిలోమీటర్ల మేర పనులు పూర్తి చేసేందుకు రూ.40కోట్ల అవసరమని ప్రభుత్వానికి నివేదించారు. ఈ నిధులు మంజూరై పనులు పూర్తయితే కాని మురుగునీరు, వర్షం నీరు సమస్యలకు మోక్షం లభించదు. మరోవైపు, కాలువ ద్వారా వచ్చే మురుగు నీటిని శుద్ధి చేసి ఆ నీటిని వినియోగించేందుకు గాను కేంద్ర ప్రభుత్వ నిధులతో పొన్నాడ వంతెన వద్ద నీటిశుద్ధి యంత్రాలను అమర్చుతున్నారు. ఈ పనులు కూడా ముందుకు సాగాలంటే ముందుగా మిర్తిబట్టి పనులు పూర్తి చేయాలి. అధికారులు ఈ సారైనా ఆక్రమణలు తొలగించి పనులు సజావుగా జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.


ప్రభుత్వానికి నివేదించాం

మిర్తిబట్టి పనులకు సంబంధించి రూ.40 కోట్లతో అంచనాలు రూపొందించిన జిల్లా అధికారుల ద్వారా ప్రభుత్వానికి నివేదించాం. ఈ నిధులు మంజూరుకు మంత్రి, స్థానిక ఎమ్మెల్యేలు కృషి చేస్తున్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించి త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

– సుగుణాకర్,
ఈఈ, పబ్లిక్ హెల్త్, శ్రీకాకుళం

మహిళల భద్రతకు పెద్దపీట

- రౌడీషీటర్లపై మళ్లీ కేసులైతే పీడీ యాక్ట్
- నూతన డీఎస్పీ సీహెచ్ వివేకానంద



శ్రీకాకుళం క్రైమ్ : మహిళలకు భద్రత కల్పించడమే ధ్యేయమని, మిస్సింగ్ కేసులపై మరింత దృష్టి కేంద్రీకరిస్తానని శ్రీకాకుళం నూతన డీఎస్పీ సీహెచ్ వివేకానంద అన్నారు. శ్రీకాకుళం సబ్ డివిజనల్ అధికారిగా (ఎస్‌డీపీవో) జిల్లా కేంద్రంలోని గూనపాలెంలో ఉన్న తన ఛాంబరులో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు పనిచేసిన డీఎస్పీ శృతి బదిలీపై డీజీపీ కార్యాలయానికి రిపోర్ట్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మీడియాతో మాట్లాడారు.

ప్రశ్న: డివిజన్ పరిధిలో నేర నియంత్రణకు ఎలాంటి కృషి చేస్తారు?

డీఎస్పీ : ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి సూచనల మేరకు డివిజన్‌లో నేర నియంత్రణకు కృషి చేస్తాం. ముఖ్యంగా మహిళల భద్రత, అదృశ్య కేసులపై ప్రత్యేక దృష్టిపెడతాం.

ప్రశ్న : నగరంలో రౌడీషీటర్ల కార్యకలాపాలను ఎలా అరికడతారు?

డీఎస్పీ: సబ్ డివిజన్ పరిధిలో రౌడీషీటర్లు నేరాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి పీడియాక్టు అమలు చేస్తాం. ఒక వేళ రౌడీషీట్ క్లోజ్ చేసినా జూదం, బెట్టింగ్, సెటిల్‌మెంట్లు వంటివి చేసినట్లు తమ దృష్టికి వస్తే ఎస్పీ ఆదేశాలతో మళ్లీ రౌడీ షీట్లు తెరుస్తాం.

ప్రశ్న: పేకాట స్థావరాల కట్టడికి ఎలాంటి చర్యలు చేపడతారు..?

డీఎస్పీ: పేకాట స్థావరాలపై దాడులు చేస్తాం. గ్యాంబ్లింగ్‌ను అరికడతాం. హోటళ్లు, లాడ్జీల్లో పేకాట నిర్వహిస్తే యాజమాన్యంపై, ఆడేవారిపై కేసులు పెడతాం. హోటళ్లను సీజ్ చేస్తాం.

ప్రశ్న: గంజాయి, ఇతర మాదకద్రవ్యాల నియంత్రణకు చేసే కృషి ఎలా ఉంటుంది..?

డీఎస్పీ: గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా చేసే అనుమానిత వ్యక్తులను కాంప్లెక్సుల్లో, స్టేషన్లలో దృష్టిపెడతాం. లాడ్జీలకు వచ్చేవారి పూర్తి వివరాలు రికార్డుల్లో పొందుపరిచేలా చూడాలి. ముఖ్యంగా అనుమానిత వ్యక్తుల ఐడీ ప్రూఫ్స్ లేకపోతే నిర్వాహకులపై చర్యలు తప్పవు. మైనర్లకు రూములివ్వరాదు.

ప్రశ్న: మద్యం అక్రమ రవాణా, తాగి వాహనాలు నడిపేవారిపై చర్యలు..?

డీఎస్పీ: సబ్‌డివిజన్ పరిధిలో ఆరు ఎన్డీపీఎస్ కేసులు కట్టాం. బహిరంగంగా మద్యం సేవించడం నిషేధం. బార్ అండ్ రెస్టారెంట్లు సమయపాలన పాటించాలి. అర్ధరాత్రి దాటాక అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రాకూడదు.

ప్రశ్న: ప్రజలకిచ్చే సందేశం?

డీఎస్పీ: సమస్యల విషయమై నేరుగా ఎవరైనా వచ్చి కలవవచ్చు.. వాటి పరిష్కారానికి సాధ్యమైనంత కృషి చేస్తాం. ప్రజలు కూడా సహకరించాలి.

హిందీ భాషా వికాసానికి చొరవతీసుకోండి



ఎమ్మెల్యే శంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న హిందీ ప్రచార సభ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: హిందీ భాషాభివృద్ధికి తోడ్పాటు అందించాలని హిందీ ప్రచార సభ హైదరాబాద్ ప్రతినిధి బృందం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు మంగళవారం శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌ను ఆయన నివాసంలో కలసి వినతిపత్రం అందించారు. హిందీ ప్రచార సభ హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయ సమన్వయకర్త కోనే శ్రీధర్ మాట్లాడుతూ ఎల్పీ సెట్ (భాషా పండిత ప్రవేశపరీక్ష) ద్వారా హిందీ పండిత శిక్షణ కళాశాలల్లో ప్రవేశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. డీఎస్సీలో హిందీ పండిట్ పోస్టులను పెద్ద ఎత్తున భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో హిందీ మంచ్ అధ్యక్షుడు దొంతం పార్వతీశం, కార్యదర్శి కనుగుల సత్యం, ఏపీ ఇంటెలెక్చువల్స్ ఫోరం ఉపాధ్యక్షులు పూడి జనార్దన రావు, హిందీ ప్రచార సభ ప్రచారక్ ఆర్.ఉదయ భాస్కర్, ఎస్.బ్రహ్మాజీ, భగత్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం



ర్యాలీ నిర్వహిస్తున్న వీసీ, విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.ఆర్.రజిని అన్నారు. వర్సిటీలో జాతీయ సేవా పథకం యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పి.సుజాత, ఎన్‌ఎస్ఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ ఎం.అనురాధ, చీఫ్ వార్డెన్ ఎస్.లోకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మధుపాంలో గ్రామదేవత ఉత్సవాలు



మధుపాంలో ముర్రాటలతో వెళ్తున్న మహిళలు

జి.సిగడాం : మండలంలోని మధుపాం, మర్రివలస తదితర గ్రామాల్లో అసిరితల్లి గ్రామదేవత ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు ముర్రాటలతో వెళ్లి అమ్మవారికి చల్లదనం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

8న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ మీట్

శ్రీకాకుళం న్యూకాలనీ: దివంగత కొన్న చిన్నారావు మెమోరియల్ జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్–2024 పోటీలు సెప్టెంబర్ 8న నిర్వహిస్తున్నామని నిర్వహణ కమిటీ ముఖ్య ప్రతినిధులు కొన్న వెంకటేశ్వరరావు (వాసు), కొన్న మధుసూదనరావు, ప్రగాడ అశోక్‌కుమార్, పూడి బాలాదిత్య, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సహకారంతో ఈ పోటీలు నిర్వహిస్తామని చెప్పారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు



ఉత్సాహంగా సాగుతున్న బ్యాడ్మింటన్ పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ క్రీడోత్సవ పోటీలు ఉత్సాహభరితంగా సాగుతున్నాయి. తొలిరోజు కోడిరామ్మూర్తి స్టేడియంలో 100 మీటర్ల పరుగుపందాలు, బ్రిస్క్‌వాక్, వాలీబాల్ పోటీలు, శాంతినగర్‌కాలనీలో ఉన్న డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో షటిల్ బాడ్మింటన్, టేబుల్‌టెన్నిస్ పోటీలు జరిగాయి. బుధవారం జరగనున్న వివిధ క్రీడాపోటీలకు సంబంధించిన షెడ్యూల్, క్రీడాంశాల వివరాలను డీఎస్‌డీఓ డాక్టర్ శ్రీధర్‌రావు వెల్లడించారు.

రాజ్యాంగాన్ని గౌరవించాలి



మాట్లాడుతున్న డీఎల్ఎస్‌ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: పవిత్రమైన భారత రాజ్యాంగానికి లోబడే ప్రతిఒక్కరూ నడుచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. మంగళవారం వికాస్ హైస్కూల్లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. లోక్ అదాలత్, ఇతర చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జి.ఇందిరా ప్రసాద్, హెచ్‌ఎం జి.నిర్మల, కె.వేణుగోపాలరావు, కె.మురళి తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు గంబూషియా చేపలు



చేపపిల్లలను విడిచిపెడుతున్న అధికారులు

శ్రీకాకుళం అర్బన్: అరసవిల్లిలోని సూర్యనారాయణ మూర్తి దేవస్థానంలో ఇంద్ర పుష్కరిణి, సమీప చెరువుల్లో దోమలు వృద్ధి చెందకుండా గంబూషియా చేపపిల్లలను విడిచిపెడుతున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి తెలిపారు. శ్రీకాకుళం నగర కమిషనర్ ఓబులేసు, నగర బీసీ అధ్యక్షుడు ఉంగటి రమణమూర్తి, ఉంగటి పాపారావుతో కలిసి మంగళవారం చేపపిల్లలు విడిచిపెట్టారు. కార్యక్రమంలో 25వ డివిజన్ ఇన్‌చార్జి తెలుగు నాగరత్నం, సూరిబాబు, టీడీపీ నాయకులు గొలివి దామోదర్, రాయపిల్ల అర్జున్, తెలుగు జగదీశ్ పాల్గొన్నారు.

పాత నేరస్తులపై నిఘా: ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : రాత్రి వేళల్లో గస్తీ (నైట్‌బీట్) విధులు పటిష్ఠంగా అమలు చేసి తద్వారా నేర నియంత్రణకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. మంగళవారం రాత్రి జిల్లా పోలీసు కార్యాలయంలో సీఐలు, ఎస్‌ఐలతో నేర నియంత్రణ కోసం నైట్ బీట్ సిస్టం నిర్వహణ, అమలు, బీట్ పాయింట్లు, సస్పెక్ట్స్, పాత నేరస్థులు, కొత్త వ్యక్తుల తనిఖీ వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరచుగా పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. రాత్రి వేళల్లో పకడ్బందీగా గస్తీ విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు ఎస్పీ డాక్టర్ జి.ప్రేమ్‌కాజల్, డీఎస్పీ సీహెచ్ వివేకానంద, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన డీఎస్పీ, సీఐలు, ఎస్‌ఐలు

శ్రీకాకుళం క్రైమ్ : సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాలో వివిధ స్టేషన్లలో నియమితులైన పలువురు సీఐలు, ఎస్‌ఐలతో పాటు శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద మంగళవార ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీని కలిసిన వారిలో కళింగపట్నం మెరైన్ సీఐ బి.ప్రసాదరావు, ఎస్‌ఐలు సీహెచ్ దుర్గాప్రసాద్ (నరసన్నపేట), బి.అనిల్‌కుమార్ (సారవకోట), ఎస్.కె.ఖాదర్‌భాషా (మందస), ఇ.శ్రీనివాస్ (ఇచ్ఛాపురం రూరల్), ఎం.ప్రవల్లిక (బూర్జ) ఉన్నారు.

ఉత్సాహంగా ఉట్టి సంబరాలు

శ్రీకాకుళం కల్చరల్ : శ్రీకృష్ణాష్టమి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉట్టి సంబరాలు అంబరాన్నంటాయి. జిల్లా కేంద్రంలోని నానుబాలవీధిలోని వేణుగోపాల స్వామి దేవాలయం సామూహిక పుజలు, ఊయల సేవలు, భజనలు నిర్వహించారు. గాజుల వీధిలోని అనంత భారతి ఆర్ష విజ్ఞాన వాటికలో భాస్కరభట్ల శ్రీరామశర్మ ఆధ్వర్యంలో 'బాలగోకులం' సందడిగా సాగింది. 30 మంది చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలతో ఆకట్టుకున్నారు. నారాయణ తిరుమల కొండపై వేంకటేశ్వరస్వామి దేవాలయంలో వంశపారంపర్య ధర్మకర్త జి.యతిరాజులు, అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించి వజ్రకవచ ధారణలో అలంకరణ చేశారు. ఊయల ఉత్సవం నిర్వహించి గీతాలను ఆలపించారు. డీసీసీబీ కాలనీలోని భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు గోపాలాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి 51 రకాల పిండివంటలతో నైవేద్యం పెట్టారు. అనంతరం ఉట్టి సంబరం నిర్వహించారు. కృష్ణాపార్కు వద్ద ఉట్టి సంబరం కోలాహలంగా సాగింది.

శ్రీకాకుళం కల్చరల్: అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవాలయంలో అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఈఓ డి.ఎల్.వి.రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులను అనివెట్టి మండపంలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు.

రణస్థలం: కృష్ణాష్టమి పురస్కరించుకుని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రణస్థలంలో శ్రీకృష్ణ భగవానుని ఊరేగింపు ఘనంగా జరిగింది. కార్యక్రమంలో నిర్వాహకులు లక్ష్మణనాయుడు, సూర్యనారాయణ, దిలీప్ కుమార్, ఎల్లమ్మ, జయమ్మ, అన్నపూర్ణ, నారాయణమ్మ పాల్గొన్నారు.



శ్రీకాకుళం కల్చరల్: కృష్ణాపార్కు వద్ద ఉట్టి సంబరం



రణస్థలం: ఊరేగింపు నిర్వహిస్తున్న త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు



శ్రీకాకుళం కల్చరల్ :నారాయణ తిరుమలలో ఊయల ఉత్సవం



అరసవల్లి అనివెట్టి మండపంలో పూజలు చేస్తున్న అర్చకులు



శ్రీకాకుళం కల్చరల్ :నానుబాలు వీధి వేణుగోపాల స్వామి ఆలయంలో పూజలు



శ్రీకాకుళం కల్చరల్ :డీసీసీబీ కాలనీలో 51 రకాల పిండివంటలతో నైవేద్యం



శ్రీకాకుళం కల్చరల్ : ఆర్షవిజ్ఞాన వాటికలో సంబరాలు



శ్రీకాకుళం కల్చరల్ :బలగ హరేరామ మందిరంలో ఊయల ఉత్సవం